సాక్షి
ఆదిలాబాద్

సోమవారం । 29 । జనవరి । 2024



పూసాయికి పోటెత్తిన భక్తజనం
పూసాయి జాతరకు భక్తులు పోటెత్తారు. వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేపట్టారు. 8లో▸



'మెస్రం' తిరుగు పయనం
కేస్లాపూర్ నుంచి పాదయాత్రగా బయలుదేరిన మెస్రం వంశీయులు ఆదివారం జన్నారం మండలం కలమడుగుకు చేరుకున్నారు. గోదావరి జలసేకరణ అనంతరం తిరుగు పయనమయ్యారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
29.0/14.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చలితీవ్రత పెరగనుంది. ఉదయం పొగమంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

తాతా ఎలా ఉన్నావు.. పింఛన్ వస్తుందా..?

- తాంసిలో వృద్ధులను ఆత్మీయంగా పలకరించిన ఎమ్మెల్యే..



వృద్ధులను పలకరిస్తున్న ఎమ్మెల్యే అనిల్

తాంసి: 'తాతా ఎలా ఉన్నావు.. ఆరోగ్యం బాగుందా.. పింఛన్ వస్తుందా.. అంటూ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పలువురు వృద్ధులను అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యే ఆదివారం పర్యటించారు. వృద్ధుల వద్దకు స్వయంగా వెళ్లి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పలువురు వారి సమస్యలను ఎమ్మెల్యేకు చెప్పుకున్నారు.

శ్రమదానం



రోడ్డును బాగుచేస్తున్న గుబిడి వాసులు

తాంసి: భీంపూర్ మండలంలోని గుబిడి గ్రామస్తులు తమ గ్రామ రోడ్డును ఆదివారం శ్రమదానంతో బాగు చేసుకున్నారు. గ్రామానికి ఉన్న ఏకైన మట్టి రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. రాళ్లు తేలి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీస్‌ను సైతం నిలిపివేశారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన పలువురు యువకులు ముందుకు రాగా గ్రామస్తులు స్వచ్ఛందంగా శ్రమదానం చేసి రోడ్డును బాగు చేసుకున్నారు. వీరిని సర్పంచ్ ప్రతాప్ యాదవ్ అభినందించారు.

కొనసాగుతున్న 'రైల్వేలైన్ సాధన' దీక్ష



నినాదాలు చేస్తున్న కేఆర్‌కే కాలనీవాసులు

ఎదులాపురం: ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ వెంటనే నిర్మించాలని డిమాండ్ చేస్తూ రైల్వేలైన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో చేపడుతున్న రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం దీక్షలో కమిటీ నాయకులు కాసవేణి నారాయణ, నిమ్మల నరేందర్, కందుల రవీందర్, బండి దేవిదాస్‌చారి, దర్శనాల లక్ష్మణ్ కూర్చున్నారు. వీరికి కేఆర్‌కే కాలనీవాసులు సంతోష్, మారుతి, రమేశ్, పవన్, పోచన్న, మోహన్, సురేశ్ మద్దతు తెలిపారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో 'పసుపు బొట్టు'



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

బజార్‌హత్నూర్: మండలంలోని డేడ్ర గ్రామంలో అటవీశాఖ, ఆర్యవైశ్య వాసవి మహిళా మండలి ఆదిలాబాద్ ఆధ్వర్యంలో గిరిజన మహిళలకు ఆదివారం పసుపు బొట్టు కార్యక్రమం నిర్వహించారు. సంఘం అధ్యక్షురాలు ప్రియాంక మహాజన్ మాట్లాడుతూ.. గిరిజనుల ఆరాధ్య దైవం జంగుబాయి దీవెనలు అందరికి ఉండాలని కోరారు. 70 మంది గిరిజన మహిళలకు నోములు, పసుపు బొట్టు వాయినాలు అందజేశారు. కార్యక్రమంలో ఇచ్చోడ డిప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్ మహాజన్, వాసవి ఫౌండర్ సరిత, గౌరవాధ్యక్షురాలు రాగిణి, వాసవి మహిళా మండలి ప్రధాన కార్యదర్శి సుస్మిత, అశ్విని, గ్రామ పటేల్ లింగు, సర్పంచ్ భీంరావ్, బీట్ అధికారులు ప్రీతం, తిరుపతి, ఈశ్వర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్‌సీసీ పరీక్షలు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఎన్‌సీసీ సర్టిఫికెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు 50 మంది, సోనాల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు 27 మంది, ఎన్‌సీసీ ఆదిలాబాద్ బ్రాంచ్ నుంచి 32 మంది పరీక్షకు హాజరైనట్లు అధికారులు రాజేంద్రప్రసాద్, అన్వర్, ధర్మేంద ర్‌సింగ్ తెలిపారు. ఇందులో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.



ఎస్‌ఎంసీల సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో (ఫైల్)

బడి ఎన్నికలకు బ్రేక్

- వాయిదా వేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- ఎంపీ ఎన్నికలపై ప్రభావం పడుతుందనే..
- ఇప్పటికే పాత ఎస్‌ఎంసీలు రద్దు
- గ్రాంట్ వినియోగానికి అవస్థలు
- కొత్త కమిటీలకు మోక్షం ఎప్పుడో?

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల వివరాలు

జిల్లా	పాఠశాలలు
ఆదిలాబాద్	1,223
మంచిర్యాల	839
నిర్మల్	836
కుమురంభీం	906

ఆదిలాబాద్‌టౌన్: నాలుగేళ్ల తర్వాత సర్కారు బడుల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసి అర్ధంతరంగా నిలిపివేసింది. గతంలో 2019లో విద్యాకమిటీలను ఎన్నుకోగా, అప్పటి నుంచి పాత కమిటీల పదవీకాలం పొడిగిస్తూ వచ్చారు. కొత్త ప్రభుత్వం వచ్చాక నూతన కమిటీల ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది. అయితే తాజాగా మళ్లీ ఎన్నికలను అభియాన్స్‌లో పెట్టింది. ఒకవేళ ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తే రానున్న లోక్‌సభ ఎన్నికలపై ప్రభావం పడుతుందని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిర్ణయంతో స్కూల్ పర్యవేక్షణ అస్తవ్యస్తంగా మారనుంది. పాత కమిటీలను కూడా రద్దు చేయడంతో నిధుల వినియోగం చేసే పరిస్థితి కూడా లేకుండా పోయింది. ఎస్‌ఎంసీ చైర్మన్, హెచ్‌ఎంల జాయింట్ అకౌంట్‌తోనే డబ్బులను డ్రా చేసే అవకాశం ఉంటుంది. కొత్త కమిటీలు ఏర్పడే వరకు ఆ నిధులు కూడా వినియోగించని దుస్థితి. దీంతో బడి పర్యవేక్షణ గాలికొదిలేసినట్టు కానుంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో రెగ్యులర్ జిల్లా విద్యాధికారులు, ఎంఈవోలు లేక విద్యావ్యవస్థ కుంటుపడుతుండగా, ఈ కమిటీల రద్దుతో మరింతగా పర్యవేక్షణ లోపించే అవకాశం ఉంది.

వాయిదా పడ్డ ఎన్నికలు..
ఎస్‌ఎంసీ ఎన్నికలు గతంలో 2019 డిసెంబర్‌లో నిర్వహించారు. ఆ తర్వాత నుంచి పదవీకాలం పొడిగిస్తూ వచ్చారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ కమిటీలకు మోక్షం లభించిందని అనుకున్నప్పటికీ మళ్లీ వాయిదా పడ్డాయి. ఉన్న పాత కమిటీలను కూడా రద్దు చేయడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ప్రస్తుతం ఆయా పాఠశాలల్లో చేపడుతున్న మన ఊరు–మనబడి పనులు వివిధ దశల్లో ఉన్నాయి. వీటికి సంబంధించిన నిధులను ప్రభుత్వం ఎస్‌ఎంసీ ఖాతాలోనే జమ చేస్తారు. కమిటీని రద్దు చేయడంతో ఆ డబ్బులను డ్రా చేసే అవకాశం లేదు. గతంలో ఎస్‌ఎంసీలో ఉన్న నిధులను ఖర్చు చేయకపోవడంతో ప్రభుత్వం ఆ డబ్బులను వెనక్కి తీసుకుంది.

పర్యవేక్షణ కరువు..
పాత ఎస్‌ఎంసీల రద్దు, కొత్తవాటి ఎన్నికలు వాయిదా పడడంతో విద్యా వ్యవస్థ కుంటుపడనుంది. ఉమ్మడి జిల్లాలోని చాలా పాఠశాలల్లో కొంత మంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడం పరిపాటిగా మారింది. ఎస్‌ఎంసీలు ఉన్న సమయంలో ఇలాంటివి చాలా వరకు జరిగేవి కావు. ప్రస్తుతం ఈ కమిటీలు లేకపోవడంతో పర్యవేక్షణ కరువయ్యే అవకాశం లేకపోలేదు. పాఠశాల అభివృద్ధి పనుల కోసం నిధులు అవసరమైతే సంబంధిత ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి సమస్యను విన్నవించి పరిష్కారం కోసం కృషి చేసేవారు. ఇప్పుడు ఆ కమిటీలు లేకపోవడంతో పాఠశాల అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లా పరిధిలోని చాలా పాఠశాలల్లో మన ఊరు–మనబడి పనులు జరుగుతున్నాయి. ఈ పనులను కమిటీ సభ్యులు పర్యవేక్షించేవారు. పనుల్లో నాణ్యత లోపించకుండా చూసేవారు. వీరు లేకపోవడంతో ఆ పనుల్లో కూడా జాప్యం జరిగే అవకాశాలు ఉన్నాయి. గతంలో ఎస్‌ఎంసీలు రద్దు చేసిన సమయంలో నిధుల వినియోగం కోసం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారికి జాయింట్ అకౌంట్ ఇచ్చారు. అయితే ఈ ఎస్‌ఎంసీల స్థానంలో ఎవరినైనా ప్రత్యేక అధికారులుగా నియమిస్తారా.. లేక మండల విద్యాధికారి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు బాధ్యతలు అప్పగిస్తారా అనేది వేచి చూడాల్సిందే.



PROCEEDINGS OF THE COMMISSIONER, SCHOOL EDUCATION & EX-OFFICIO STATE PROJECT DIRECTOR, SAMAGRA SHIKSHA, TELANGANA, HYDERABAD.

Date: 23-01-2024

Sub: School Education Department – Telangana Samagra Shiksha – Conduct of elections in schools to School Management Committees (SMCs) – Kept in abeyance – Orders – Issued – Reg.

The attention of all the DEOs & EO-DPOs, SS in the State is invited to the references read above. They are informed that the orders issued for conduct of elections for formation of New SMCs in schools vide reference 6th cited above are kept in abeyance until further orders.

Therefore the DEOs & EO DPOs, SS in State they are requested to take necessary immediate action accordingly.

Commissioner, School Education & Ex-Officio State Project Director

ఎస్‌ఎంసీ ఎన్నికలు వాయిదా వేస్తూ ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వు ప్రతి

ఎస్‌ఎంసీ ఎన్నికలు వాయిదా..



ఎస్‌ఎంసీ ఎన్నికలను అభియాన్స్‌లో ఉంచుతూ ఈనెల 23న పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటికీ వివిధ కారణాలతో ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేసింది. ఇప్పటికే పాత కమిటీలు రద్దయ్యాయి. ఉన్నతాధికారులు కొత్త షెడ్యూల్ విడుదల చేసిన తర్వాత నూతన కమిటీల నియామకం ఉంటుంది.
– ప్రణీత, డీఈవో

స్టాఫ్‌నర్సులొస్తున్నారు..

- జిల్లా నుంచి 282 మంది ఎంపిక
- 31న సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు
- పోస్టుల భర్తీతో పేదలకు మరింత నాణ్యమైన వైద్యసేవలు

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సు రెగ్యులర్ పోస్టులను భర్తీ చేస్తోంది. గత ఆగస్టులో అప్పటి ప్రభుత్వం స్టాఫ్ నర్సులకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వీరి నియామకాలను ఎట్టకేలకు చేపడుతోంది. ఈనెల 31న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా వీరికి నియామక పత్రాలు అందజేయనున్నారు. జిల్లా నుంచి 282 మంది ఎంపికయ్యారు. వీరిలో హర్షం వ్యక్తమవుతోంది. రెగ్యులర్ నియామకాలు చేపట్టడంతో సర్కారు ఆస్పత్రుల్లో పేదలకు మరింత నాణ్యమైన వైద్యసేవలు అందనున్నాయి. కాగా జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధిలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో 9 పోస్టులు ఖాళీగా ఉండగా, రిమ్స్‌లో దాదాపు 250 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీరి నియామకంతో ఈ పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉంది.

31న నియామక పత్రాలు..
నూతనంగా నియామకమైన స్టాఫ్‌నర్సులకు ఈనెల 31న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నియామక పత్రాలు అందజేయనున్నారు. కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా అందజేయనున్నారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి 282 మంది స్టాఫ్ నర్సులుగా ఎంపికైనట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. వీరిని బాసర జోన్ పరిధిలో పోస్టింగ్ ఇవ్వనున్నారు. ఇదిలా ఉండగా సోమవారం ఎంపికైన వారిని డీఎంహెచ్‌వో కార్యాలయానికి పిలిచి హాల్‌టికెట్లను పరిశీలించనున్నారు. వారి పాస్ ఫొటో తీసుకొని ఐడెంటిటీ కార్డులు తయారు చేసి అందజేయనున్నారు. కార్డు ఉన్న వారిని మాత్రమే ఎల్‌బీ స్టేడియంలోనికి అనుమతిస్తారని డీఎంహెచ్‌వో తెలిపారు.



ఎంపికైన స్టాఫ్ నర్సులకు అందిన ఆహ్వానపత్రం

ప్రత్యేక వాహనాల్లో తరలింపు..
స్టాఫ్ నర్సులుగా ఎంపికైన వారిని ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్‌కు తరలించనున్నారు. ఇందుకోసం జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరు బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. వీరి సౌకర్యాలను పర్యవేక్షించేందుకు 25 మంది లైజన్ అధికారులను నియమించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో 8 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఐడెంటిటీ కార్డులు అందజేయనున్నారు. టిఫిన్‌తో పాటు బస్సు, భోజనం సౌకర్యాన్ని వైద్యారోగ్య శాఖ కల్పించనుంది.

జిల్లా నుంచి 282 మంది ఎంపిక



స్టాఫ్‌నర్సు రిక్రూట్‌మెంట్‌కు సంబంధించిన ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. జిల్లా నుంచి 282 మంది ఎంపికయ్యారు. వైద్యారోగ్య శాఖలో తొమ్మిది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నూతన స్టాఫ్ నర్సుల నియామకాలతో రిమ్స్‌లోని పోస్టులు కూడా భర్తీ కానున్నాయి. సోమవారం ఎంపికైన అభ్యర్థుల హాల్‌టికెట్లను పరిశీలించడం జరుగుతుంది. అనంతరం వారికి ఐడెంటిటీ కార్డులను అందజేస్తాం. ఈనెల 31న హైదరాబాద్‌లో సీఎం చేతుల మీదుగా వీరికి నియామక పత్రాలు అందజేయడం జరుగుతుంది.
– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


- ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వీరాంజనేయులు

ఎదులాపురం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వీరాంజనేయులు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా యూనియన్ పరంగా పర్యటనలు చేపడుతూ ఆయా డిపోల్లోని ఉద్యోగుల సమస్యలు,వారికి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు, పెరిగిన పనిభారం, ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత ప్రయాణంపై వారికి ఎదురవుతున్న ఇబ్బందులు, గత ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసిన ప్రక్రియ తక్షణమే పూర్తి చే అంశాలపై అభిప్రా యాలు సేకరించి యాజమాన్యానికి, ప్రభుత్వానికి నివేదించి పరిష్కరించాలని కోరనున్నట్లు తెలిపా రు. ఇందులో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి గంగాధర్, ఆదిలాబాద్ రీజియన్ కార్యదర్శి బీమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న వీరాంజనేయులు

ఆలయ భూములు పరాధీనం!



శ్రీవేంకటేశ్వర ఆలయం

- నిషేధిత భూములకు 'ధరణి'లో పట్టాలు
- కబ్జాలో వందల ఎకరాలు..
- అధికారుల చేతివాటంతోనే..?
- అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకోని దేవాదాయశాఖ



బోథ్: విక్రయించడానికి వీలులేని నిషేధిత ఆలయ భూములకు ఏకంగా ఇతరుల పేరిట పట్టాలు వచ్చాయి. అధికారుల సహకారంతో వందల ఎకరాలు అన్యాక్రాంతానికి గురయ్యాయి. జిల్లాలో చాలా మండలాల్లో ఈ పరిస్థితి ఉంది. దేవాదాయ చట్టం ప్రకారం ఆలయ భూములను ఇతరులకు పట్టా చేయవద్దని ప్రభుత్వం 22ఏ, 22సీలో పేర్కొంది. ఈ జాబితాలో ఉన్న భూముల వివరాలను రిజిస్ట్రేషన్ శాఖతో పాటు ఆయా తహసీల్దార్ కార్యాలయాలకు ఇప్పటికే దేవాదాయ శాఖ అందించింది. అయితే పలు తహసీల్దార్ కార్యాలయాల్లో యథేచ్ఛగా ఆలయ భూములను ఇతరుల పేరిట పట్టా చేశారు. ధరణి రాక ముందే ఈ తతంగం నడిచినట్లు తెలుస్తోంది. ఆలయ భూములను అప్పట్లో పూజారులు సాగు చేసుకునేవారు. కొన్నిచోట్ల ఆలయ నిర్వహణ నిమిత్తం కౌలుకు ఇచ్చి వచ్చిన డబ్బును ఖర్చు చేసేవారు. కాలక్రమేనా.. కొంతమంది ఈ భూముల్లో పాగా వేశారు. అధికారులను మచ్చిక చేసుకుని ఆలయ భూముల సర్వే నంబరులో తమ పేర్లను పహనీలో నమోదు చేయించుకొని పట్టాలు చేయించుకున్నారు.

రిజిస్ట్రేషన్ కాకుండా పట్టాలు..
ఆలయానికి చెందిన భూములు నిషేధిత భూ విక్రయ జాబితాలో ఉండటంతో కొంతమందిరిజిస్ట్రేషన్ చేసుకోకుండా తహసీల్దార్ కార్యాలయంలో తమ పేరిట అక్రమంగాపట్టాలు చేసుకున్నారు. ఇందుకు అధికారులు వంత పాడినట్లు తెలుస్తోంది. రూ.లక్షల్లో సొమ్ముచేతులు మారినట్లుసమాచారం.

బోథ్‌లో విఠలేశ్వరుని భూములు..
రిజిస్ట్రేషన్ శాఖ వద్ద గల సమాచారం మేరకు బోథ్ బి శివారులోని 96 సర్వే నంబరులో దాదాపు 17 ఎకరాలు, బోథ్ కె శివారులోని 14 సర్వే నంబరులో 9.29 ఎకరాలు, 20 సర్వే నంబరులో 10.31ఎకరాలు శ్రీవిఠలేశ్వర మందిరానికి చెందినవిగా ఉన్నాయి. అలాగే 252 సర్వేనంబర్‌లో 7.39 ఎకరాలు శ్రీజంగ్ మఠం పేరుతో రిజిస్ట్రేషన్ శాఖ వద్ద ఉంది. కౌఠ బి శివారులో 107 సర్వే నంబరులో 4.26 ఎకరాలు, 108 సర్వేనంబరులో 5.14 ఎకరాలు, పొచ్చెర శివారులో 287 సర్వే నంబరులో 0.17 గుంటలు శ్రీవిఠలేశ్వరమందిరానికి చెందినదిగా రిజిస్ట్రేషన్ శాఖ వద్ద ఉంది. ఇవేకాక మండలంలో పలు ఆలయాల భూములు సైతం ఇతరుల పేరుపై నమోదై ఉన్నాయి. అయితే కొన్ని సర్వేనంబర్లకు చెందిన బై నంబర్లు దేవాదాయశాఖకు చెందినవి కాకున్నా, నిషేధిత జాబితాలో ఉన్నట్లు కొంతమంది భూయజమానులు పేర్కొంటున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం..
దేవాదాయ శాఖ భూములను ఇతరులకు పట్టా చేయరాదు. అయితే కొన్నిచోట్ల పట్టాలు చేసినట్లు తెలిసింది. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, అవసరమైతే కోర్టుకు వెళ్తాం. గతంలోనే 22ఏ, 22సీ కింద దేవాదాయ భూముల వివరాలను రిజిస్ట్రేషన్ శాఖకు పంపించాం. సేత్వార్‌లో ఉన్న ప్రకారం దేవాదాయ శాఖ భూముల వివరాలు మా వద్ద ఉన్నాయి. అలాంటి వాటిని రిజిస్ట్రేషన్ చేసినా, రెవెన్యూ రికార్డుల్లో ఇతరుల పేర్లు నమోదు చేసినా వారిపై చట్టపరంగా చర్యలు చేపడుతాం.
– నవీన్‌కుమార్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్

చర్యలు తీసుకుంటాం
దేవాదాయ శాఖకు చెందిన ఆలయ భూములను విక్రయించడానికి వీలు లేదు. గతంలో విక్రయిస్తే, వాటికి సంబంధించిన వివరాలు సేకరిస్తాం. తగు చర్యలు చేపడతాం.
– సుభాష్‌చందర్, తహసీల్దార్, బోథ్

జిల్లాలో ఇతర ఆలయాల భూములు సైతం..

- బోథ్ మండలం కుచులాపూర్ పంచాయతీ పరిధిలో గల అతి ప్రాచీనమైన శ్రీవేంకటేశ్వర ఆలయానికి చెందిన 48 ఎకరాల 29 గంటల భూమి దశాబ్దాలుగా పరాధీనంలో ఉంది.
- ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర దేవాలయ ధర్మశాల పేరిట గుడిహత్నూర్ మండలంలోని సీతాగొందిలో 29.31 ఎకరాల భూమి ఉంది. ఇందులో 26.31 ఎకరాలు పరాధీనంలో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ భూమి విషయమై అధికారులు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు.
- నేరడిగొండ మండలం వడూర్ గ్రామంలోని శ్రీరామ చంద్రస్వామి ఆలయానికి 48 ఎకరాల భూమి ఉంది. వడూర్, ఆరెపల్లి, బుద్దికొండ, వాగ్దారి, బోరిగాం గ్రామాల్లో ఉన్న ఈ భూమి ప్రస్తుతం ఇతరుల కబ్జాలో ఉంది.
- ఆదిలాబాద్ పట్టణ కేంద్రంలోని పురాతన గోపాలకృష్ణ మఠానికి చెందిన 1259 ఎకరాల వ్యవసాయ భూములు మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా కేలాపూర్ తాలుకాలోని గోమ్మి గ్రామంలో ఉన్నాయి.
- గుడిహత్నూర్ మండలంలోని సీతాగొంది హనుమాన్ ఆలయం పేరిట 31.24 ఎకరాల భూమి ఉంది. అయితే స్థానికంగా 15 ఎకరాలు మాత్రమే ఉందని అధికారులు చెబుతున్నారు. మిగతా భూమి ఎక్కడికెళ్లిందో తెలియని పరిస్థితి.
- ఆదిలాబాద్ పట్టణంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర ఆలయానికి బేల మండలంలో 54 ఎకరాలు, జైనథ్ మండలంలో 221 ఎకరాలు, తలమడుగు మండలంలో 43 ఎకరాలు ఉన్నాయి. ఈ భూముల్లో ఇటీవల అధికారులు 23 ఎకరాలు గుర్తించి సాగు చేస్తున్నారు. మిగతా భూమి కొంత మంది పట్టా చేసుకున్నట్లు సమాచారం. ఈ భూములు తమకు అప్పగించాలని ఇప్పటికే దేవాదాయశాఖ అధికారులు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు.

క్లుప్తంగా

మొక్కజొన్న పంటపై అడవిపందుల దాడి



మొక్కజొన్నను చూపిస్తున్న రైతు రాజన్న

కుంటాల: కుంటాల శివారు ప్రాంతంలోని చాకలి రాజన్న మొక్కజొన్న పంటపై శనివారం రాత్రి అడవి పందులు దాడి చేశాయి. తనకున్న భూమితో పాటు కౌలుకు తీసుకుని రబీలో ఏడు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. ప్రస్తుతం కంకి దశలోకి వచ్చింది. దీంతో అడవి పందులు దాడి చేయడంతో సుమారు ఎకరం పంట నష్టం వాటిల్లిందని, దీంతో రూ.80 వేలు నష్టపోయానని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

పంటల ధ్వంసం...

లక్ష్మణచాంద: మండలంలో వివిధ గ్రామాల్లో యాసంగిలో రైతులు సాగుచేస్తున్న మొక్కజొన్న పంటపై అడవి జంతువులు దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయి. ఆదివారం మండలంలోని పొట్టపెల్లి గ్రామంలో రైతు సాయన్న సాగు చేస్తున్న మొక్కజొన్న పంటపై అడవి పందులు దాడి చేసి మొక్కజొన్న పంటను ధ్వంసం చేశాయి. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతు ఆవేదనతో ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి



గంగారాం (ఫైల్)

నార్నూర్: అనుమానాస్పదస్థితిలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై రవికిరణ్ వివరాల ప్రకారం.. మండలంలోని దేవారిగూడకు చెందిన కొర్రం గంగారాం(35) నాగలకొండ గొండుగూడ గ్రామంలోని కుమ్ర దుందు ఇంటికి సమీపంలోని మట్టి రోడ్డుపై మృతిచెంది కనిపించాడు. మృతుడి ముఖంపై గాయాలున్నాయి. అయితే గంగారాంకు మద్యం అలవాటు ఉందని, నాగలకొండ గొండుగూడెం నుంచి దేవారిగూడకు నడుచుకుంటూ వెళ్లే క్రమంలో కిందపడి చనిపోయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గంగారాంకు భార్య గౌరూబాయి, కుమారుడు ఉన్నారు.

పీఎంను కలిసిన 'ఉజ్వల' లబ్ధిదారులు

కౌటాల: ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకంలో భాగంగా కౌటాల మండల కేంద్రానికి చెందిన లబ్ధిదారులు కత్తెర్ల సాయికుమార్– రోజా దంపతులు శనివారం ఢిల్లీలో దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీని కలిశారు. ఉజ్వల పథకానికి ఎంపికైన పలు రాష్ట్రాలకు చెందిన లబ్ధిదారులతో పీఎం ముఖ్య కార్యాలయంలో సమావేశం నిర్వహించగా కౌటాలకు చెందిన సాయికుమార్ – రోజా దంపతులకు అవకాశం లభించింది. కేంద్ర ప్రభుత్వ హయంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తామని పీఎం మోదీ సమావేశంలో మాట్లాడినట్లు వారు పేర్కొన్నారు. ఉజ్వల యోజన కింద కేంద్ర ప్రభుత్వం పేద మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు అందించడంతో పథకం పనితీరును పీఎం మోదీ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో కట్టెల పొయ్యి మీద వంట చేసేవాళ్లమని, ఉజ్వలతో తమ కష్టాలు దూరమైనట్లు పీఎంకు వివరించినట్లు వారు తెలిపారు.

జంగుబాయి క్షేత్రం.. జనసందోహం

- దక్షిణ భారతదేశంలోనే ఏకైక పుణ్యక్షేత్రం
- వెల్లువిరిసిన ఆధ్యాత్మికత
- ఇప్పటికే దర్శించుకున్న 210 మేళంలు
- తండోపతండాలుగా తరలివస్తున్న ఆదివాసీలు
- సంప్రదాయాలతో కొనసాగుతున్న పూజలు
- దైవాక్షేత్రానికి చేరుకుంటున్న ఆదివాసీల



పోచమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



సంయుక్తంగా మొక్కుతున్న భక్తులు

కెరమెరి(ఆసిఫాబాద్): ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాల మధ్య జంగుబాయికి ఆదివాసీలు మొక్కులు చెల్లించుకుంటున్నారు. దక్షిణ భారత దేశంలోనే ప్రజాధారణ పొందిన ఏకైక ఆదివాసీల పుణ్యక్షేత్రంగా మండలంలోని మహరాజ్‌గూడ గ్రామ సమీపంలో కొలువుదీరిన జంగుబాయి దర్శనం కోసం తెలంగాణలోని ఆదివాసీలే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, ఒరిస్సా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లకు చెందిన భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. అమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు భారీగా తరలిరాగా కిటకిటలాడింది.

పుష్యమాసం నుంచి ప్రారంభం

ఈ నెల 14 పుష్యమాసం నుంచి ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఈ నెల రోజుల పాటు కొనసాగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ కొడప జాకు, గౌరవాధ్యక్షుడు మరప బాజీరావు తెలిపారు. ఇప్పటి వరకు 210 మేళంలు జంగుబాయిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నాయి. సాంప్రదాయ నృత్యాలు, ఆదివాసీ వంటకాల ఘుమఘుమలు, నలువైపుల ఉన్న సుందర దృశ్యాలు చూపరులను మంత్రముగ్ధుల్ని చేస్తుంది. ఎంతదూరమైన భక్తులు చెప్పులు లేకుండా కాలినడకన రావడం, చిన్నారులైతే ఎడ్లబండ్లపై వస్తున్నారు. ఆలయ సమీపంలోని గుహలో జంగుబాయి, లక్ష్మీదేవి కొలువై ఉంది. గుహలోని ఆ తల్లుల దర్శనానికి ఆదివాసీలు క్యూ కడుతున్నారు. ఆదిమ తెగల్లో తుంమ్రం, రాయిసిడం, వెట్టి, హెరెకుమ్ర, మరప, మండాడి, సలాం, కొడప గోత్రాల వారుకటోడలుగా వ్యవహరిస్తూ పూజ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.



సంప్రదాయ వంటకాలు చేస్తున్న మహిళలు



ఆలయానికి వస్తున్న మేళం



రావుడ్ దేవత వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు

పూసాయికి పోటెత్తిన భక్తజనం



భక్తులతో కిక్కిరిసిన ఎల్లమ్మ ఆలయం

- కనుల పండువగా జాతర
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- జనసందోహంగా ఎల్లమ్మ ఆలయం

జైనథ్: మండలంలోని పూసాయి గ్రామానికి భక్తులు పోటెత్తారు. పూసాయి ఎల్లమ్మ తల్లి జాతర సందర్భంగా వేలాదిగా భక్తులు తరలిరావడంతో జాతర కనుల పండువగా సాగింది. ఆదివారం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జైనథ్ మండలంతో పాటు బేల, తాంసి, తలమడుగు, ఆదిలాబాద్ మండలాలు, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల నుంచే కాక మహారాష్ట్రలోని పాండర్‌కౌడ, యవత్‌మాల్, బోరి నుంచి భక్తులు తరలివచ్చి ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ప్రతీ ఏడాది పుష్య మాసంలో నెల రోజులపాటు ఇక్కడ జాతర నిర్వహించనున్నారు. ఆది, మంగళవారాలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొంటారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు ముందుగా ఆలయం ఎదుట ఉన్న నీటి ఊటలో స్నానాలు ఆచరించారు. ఎల్లమ్మ గర్భగుడి నుంచి వచ్చే జలధార కోనేరులో స్నానాలు చేస్తే వివిధ చర్మ రోగాలతో పాటు వ్యాధులు నయం అవుతాయని భక్తుల విశ్వాసం. వేల సంఖ్యలో భక్తులు రావడంతో జాతర జనసందోహంగా మారింది.

ఢిల్లీ గణతంత్ర వేడుకల్లో ఆదివాసీ కళాకారులు



గణతంత్ర వేడుకల్లో దుబార్‌పేట్ కళాకారులు

ఇచ్చోడ: దేశరాజదాని ఢిలీల్లో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఇచ్చోడ మండలంలోని దుబార్‌పేట్ ఆదివాసీ కళాకారులు పాల్గొన్నారు. వందే భారత్ గణతంత్ర వేడుకల్లో భాగంగా దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి సాంస్కృతి కళాకారులను కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. మండలంలోని దుబార్‌పేట్ కళాకారుడు కాత్లె శ్రీధర్ ఆధ్వర్యంలో కళాప్రదర్శన నిర్వహించారు. ఢిల్లీలో జరిగిన ప్రదర్శనలో అక్షయ, ప్రవళిక, భీంబాయి, స్రవంతి, నందిని, భవని, సింధుజ, మౌనిక గంగోత్రి, పల్లవి, దివ్యలు పాల్గొని ప్రదర్శించినట్లు శ్రీధర్ తెలిపారు.

ప్రారంభమైన గంగ జాతర



రథానికి పూజలు చేస్తున్న భక్తులు

జైనథ్: మండలంలోని డొల్లార గ్రామ సమీపంలో పెన్‌గంగా నది ఒడ్డున కొలువుదీరిన రామానంద్, మాదవ్ రావ్ మహారాజ్ ఆలయ జాతర ప్రారంభమైంది. ఆదివారం మహారాష్ట్రలోని పాతన్‌బోరిలోని రామనంద్, మాదవ్ రావ్ మహారాజ్ సంస్థాన్ సభ్యులు నెత్తిన మహారాజ్ పాదుకులతో పాదయాత్రగా నదికి చేరుకున్నారు. అనంతరం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, రథాన్ని ప్రతిష్ఠించారు. రథానికి పూజలు నిర్వహించి, దహి కాల హండీ నిర్వహించారు. గంగానదికి ప్రత్యేక అభిషేకాలు గావించి శోభాయాత్ర చేశారు. భజనలు చేస్తూ.. పాటలు పాడుతూ.. రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచే కాక, మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి, పూజల్లో పాల్గొన్నారు. నదీ తీరంలోని రామానంద్, మాదవ్‌రావ్ మహారాజ్ ఆలయాల్లో సైతం భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు.

ఆహ్లాదం అందనంత దూరం







నిర్మల్ జిల్లా కేంద్రంలోని దివ్యనగర్‌లో లక్షలు ఖర్చుచేసి నిర్మించిన పార్కు నిర్వహణ లేక కళావిహీనంగా మారింది. నిత్యం ఉదయం, సాయంత్రం కాలనీవాసులతో పాటు జిల్లా కేంద్రంలోని ప్రజలు వాకింగ్, జాగింగ్, వ్యాయామం కోసం వస్తుంటారు. పార్కు నిర్వహణ లేక కళావిహీనంగా కనిపిస్తోంది. ముఖ్యంగా మహిళలు, పిల్లల కోసం నిర్మించిన పార్కులో పిచ్చిమొక్కలతో కనిపిస్తోంది. పార్కు చుట్టూ నిర్మించిన వాకింగ్ ట్రాక్ చుట్టూ బురద చేరి అపరిశుభ్రంగా కనిపిస్తుంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి దివ్యనగర్‌లోని అర్బన్ అందంగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

ఆటోబోల్తా... ఐదుగురికి గాయాలు



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న స్థానికులు

ఇంద్రవెల్లి: ఆటో బోల్తాపడిన ప్రమాదంలో ఐదుగురికి స్వల్ప గాయాలైన సంఘటన ఆదివారం మండలంలోని ముత్నూర్ సమీపంలో చోటుచేసుకుంది. ప్రత్యేక సాక్షుల వివరాల ప్రకారం... ఇంద్రవెల్లి మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన యేర్మ దేవుబాయి సర్పంచ్ కుటుంబ సభ్యులు పిప్రి గ్రామం నుంచి వాల్గొండ కులదేవత పూజలకు ఆటోలో వెళ్తుండగా... ముత్నూర్ గ్రామం సమీపంలో ప్రధాన రహదారిపై ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో సర్పంచ్ యేర్మ దేవుబాయితో పాటు ఆమె భర్త యేర్మ కిషన్, కుటుంబ సభ్యులు సింధు, అఖిలకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. గాయాలైన క్షతగాత్రుల పరిస్థితి నిలకడగా ఉందని 108 అంబులెన్స్ ఈఎంటీ ప్రవీణ్‌కుమార్, పైలెట్ ఆత్రం అశోక్ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరి పరిస్థితి విషమం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని బజార్‌హత్నూర్ రోడ్డులో ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ఆదివారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మరొకరికి తీవ్ర గాయాలు కాగా క్షతగాత్రులు ఇద్దరు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో చిక్సిత పొందుతున్నాడు. ఈ ఘటనలో మహారాష్ట్రకు చెందిన శ్యాం పరిస్థితి విషమంగా ఉండగా బజార్‌హత్నూర్ మండలంలోని వర్తమన్నూర్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌కు త్రీవగాయాలైనట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలు తీర్చాలి



ఎమ్మెల్యేకు వినతి అందిస్తున్న సంఘు నాయకులు

ఉట్నూర్‌రూరల్: వైద్య ఆరోగ్య శాఖలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజా ఆరోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ చాలా ఏళ్లుగా రిమ్స్‌లో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సులు వివిధ జిల్లాల నుంచి తమతమ కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ నిర్వీరామంగా సేవలందిస్తున్నారన్నారు. ప్రస్తుతం టీఎస్‌పీఎస్సీ ద్వారా స్టాఫ్‌నర్సులు కొత్తగా నియమిస్తున్న వారిని రిమ్స్ ఆదిలాబాద్‌లో నియమించి ఇక్కడ పనిచేస్తున్న వారిని వారివారి జిల్లాలకు బదిలీ చేయాల్సిందిగా కోరారు. జీవో నం. 317 రద్దు చేయాలని, గత ప్రభుత్వం తీసుకు వచ్చిన జీఓ నం.142ను రద్దు చేయాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోశ్‌కుమార్, సంఘ నాయకులు ఉన్నారు.

ఆదివాసీల సమస్యలపై సీఎం వైఖరి చెప్పాలి

- తుడుం దెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్



మాట్లాడుతున్న గోడం గణేశ్

ఎదులాపురం: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివాసీల సమస్యలపై తన స్పష్టమైన వైఖరిని స్పష్టం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆ సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్ తెలిపారు. జిలా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనాధిగా అడవులను నమ్ముకుని జీవనం సాగిస్తున్న అడవి బిడ్డలకు ప్రభుత్వాలు అన్యాయం చేశాయన్నారు. హక్కుల కోసం రక్తం చిందించింది ఒకరైతే హక్కులను అనుభవిస్తున్న మరొకరన్నారు. నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ డిమాండ్లను పరిష్కరించి న్యాయం చేయాలన్నారు. చట్టబద్ధతలేని లంబాడాలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని, గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చెందిన 11 కులాలను ఎస్టీ జాబితాలో కలుపుతూ చేసిన అసెంబ్లీ తీర్మానాన్ని వెంటనే రద్దు చేయాలని, ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు ఎటువంటి షరతులు, తీర్మానాలు లేకుండా హక్కు పత్రాలు ఇవ్వాలని, ఆదివాసీల నిరుద్యోగ సమస్య వెంటనే పరిష్కరించాలని, స్పెషల్ డీఎస్సీ వేయాలని, గిరిజన యూనివర్సిటీలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉయిక సంజీవ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొడప నగేశ్, సహాయ కార్యదర్శి శ్యామ్‌రావు, జిల్లా అధ్యక్షుడు బాపురావు, ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, జిల్లా ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిరా, జిల్లా ప్రచార కార్యదర్శి సోయం లలిత, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ చేసేందుకు ఎంపీగా పోటీ



పూజలు చేస్తున్న రాష్ట్ర నాయకురాలు సుగుణ

నార్నూర్: ప్రజా సేవ చేసేందుకే ఎంపీగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆదివాసీ మహిళ సంఘం రాష్ట్ర నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఖండేవ్ ఆలయాన్ని ఆమె సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గతకొన్ని ఏళ్లుగా ఆదివాసీ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నానని, ప్రజాసేవ చేసే అవకాశం వస్తే తప్పకుండా ఎంపీగా పోటీ చేస్తానని తెలిపారు. ప్రజల పక్షాన ఉండే నాయకులను ప్రజలు ఎప్పుడు వారి గుండెలో పెట్టుకుంటారన్నారు. ఉద్యోగాన్ని వదిలి ప్రజాసేవ చేయడానికి సిద్ధమవుతున్న తనను ఆశీర్వదించాలని కోరారు. ఖండేవ్ ఆలయ కమిటీ సభ్యుడు తొడసం నాగోరావు, మార్లవాయి సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వర్, తుడం దెబ్బ మండలాధ్యక్షుడు శ్రీరాం, జైభారత్ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దీపక్, సార్‌మేడి మెస్రం హన్మంతారావు తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మన్నడ్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయిలతో పూర్వ విద్యార్థులు



కుభీర్ : సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

లోకేశ్వరం: వారంత ఒకేచోట చదువుకున్న విద్యార్థులు. క్లాస్‌లో పోటీగా చదివారు. మైదానంలో నువ్వా నేనా అంటూ క్రీడల్లో పాల్గొన్నారు. పదో తరగతి అనంతరం ఎవరి దారిలో వారు వెళ్లిపోయారు మండలంలోని మన్నడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003–04 పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు. మళ్లీ వారంతా పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఆదివారం ఒకేచోట కలుసుకున్నారు. అప్పుడు చదువు నేర్పిన ప్రధానోపాధ్యాయుడు దేవన్న, ఉపాధ్యాయులు ఏంరాజ్, రాజేశ్వర్, గజేందర్, రుక్మారెడ్డి, రవీందర్, భూమేష్, ముత్తన్న, రమేష్, సురేశఖర్, భీంరాం, అంజలిలను ఘనంగా సన్మానించారు.

కుభీర్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 2000–01లో పదో తరగతి చదివిన విద్యార్థులు 23ఏళ్ల తరువాత ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్నారు. చనిపోయిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులైన ఎర్రన్న, లింగన్న, మహేశ్వర్, ప్రేమ్‌సాగర్, బాలాజీలను పూర్వవిద్యార్థులు సన్మానించారు.

ట్రాక్టర్ బోల్తా... డ్రైవర్ మృతి



సాయికిరణ్ (ఫైల్)



బోల్తాపడిన కేజీవీల్స్ ట్రాక్టర్

భీమారం: మంచిర్యాల జిల్లా భీమారం మండలం దాంపూర్ గ్రామశివారులోని పొలంలో ఆదివారం వీల్స్ ట్రాక్టర్ బోల్తాపడడంతో డ్రైవర్ సిడాం సాయికిరణ్(22) మృతి చెందినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... పొలంలో వీల్స్ ట్రాక్టర్‌తో చదును చేస్తుండగా అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ దానికింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెన్నూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

రామకృష్ణాపూర్: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని భగత్ సింగ్‌నగర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ వివరాల ప్రకారం... నీరటి రమాదేవి (36) భర్త సింగరేణి ఉద్యోగి కాగా వీరికి ఇద్దరు సంతానం. శనివారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించి అత్త స్థానికుల సాయంతో కిందకుదింపి ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.